కళావిహీనం



కళతప్పిన చినవాల్తేరు కాలనీ పార్కు

- ఆహ్లాదానికి దూరంగా చినవాల్తేరు కాలనీ పార్కు
- శిథిలమైన ఆట వస్తువులు
- ఆటలకు ఆసక్తి చూపని చిన్నారులు
- పార్కు నిర్వహణను గాలికొదిలేసిన జీవీఎంసీ అధికారులు


ఫ్లోరింగ్ పెచ్చులూడి పూర్తిగా పాడైన వాలీబాల్ కోర్ట్

బీచ్‌రోడ్డు: చినవాల్తేరు కాలనీ పార్కు కళావిహీనంగా తయారైంది. దీనిలో పిల్లలు ఆడుకునేందుకు లక్షల రూపాయలతో జీవీఎంసీ ఆట వస్తువులు ఏర్పాటు చేసింది. సరైన నిర్వహణ లేకపోవడంతో అవన్నీ శిథిలమవుతున్నాయి. ఆడుకునే వీలు లేక పిల్లలు రాకపోవడంతో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు పార్కు అడ్డాగా మారింది. అధికారుల నిర్లక్ష్యం వల్ల పిల్లలు, పెద్దలకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని ఇచ్చే ఈ పార్కు కాస్త.. ఆకతాయిలు, మందుబాబులకు నిలయమైంది.

గత ప్రభుత్వంలో పార్కుల అభివృద్ధి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రేటర్ విశాఖపట్నం స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ కింద నగరంలోని అనేక పార్కులను అభివృద్ధి చేశారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురికాకుండా చిన్న చిన్న పార్కులను ఏర్పాటు చేశారు. ప్రతి పార్కులో పిల్లల ఆట వస్తువులు, పెద్దల ఆరోగ్య పరిరక్షణ కోసం వ్యాయామ పరికరాలను అమర్చారు. చినవాల్తేరు కాలనీ పార్కును కూడా లక్షల రూపాయలతో అభివృద్ధి చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈ పార్కు శిథిలమవుతోంది.

అటకెక్కిన ఆట పరికరాలు

జీవీఎంసీ అధికారులు ఈ పార్కు నిర్వహణను గాలికొదిలేయడంతో ఆట పరికరాలు పూర్తిగా శిథిలమవుతున్నాయి. వాలీబాల్ కోర్టు ఫ్లోరింగ్ మొత్తం కొట్టుకుపోయింది. జారుడు బల్లలు పెద్ద పెద్ద రంధ్రాలతో దర్శనమిస్తున్నాయి. చిన్నారులు ఊగే ఊయలలు కనిపించడం లేదు. దీంతో పిల్లలు పార్కులోకి రావడం మానేశారు.

మందుబాబులకు అడ్డా

ఈ పార్కును పట్టించుకునే వారే లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. సాయంత్రం నుంచి రాత్రి వరకు పార్కులో మందుబాబులు కూర్చొని మద్యం తాగుతున్నారని స్థానికులు చెబుతున్నారు. పార్కులో ఎక్కడ చూసినా మద్యం సీసాలే దర్శనమిస్తున్నాయి. ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి పార్కును ఆధునికీకరించాలని, నూతన ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అధ్వానంగా మరుగుదొడ్లు



ఈ పార్కులో మూడు మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. అధికారుల పార్కు నిర్వహణను గాలికి వదిలేయడంతో మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. వాటిలోకి వెళ్లాలంటేనే భయపడేలా ఉన్నాయి. మల, మూత్ర విసర్జన బేసిన్‌లు పూర్తిగా పాడయ్యాయి.


చినవాల్తేరు కాలనీ పార్కులో మద్యం సీసాలు, చెత్త



జారుడు బల్లలకు ఏర్పడిన రంధ్రాలు

'ఇన్‌టెక్-క్విజ్' పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్(ఇన్‌టెక్) విశాఖపట్నం చాప్టర్ ఆధ్వర్యంలో ఆగస్ట్ 1న విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. 'ఇంటెక్ హెరిటేజ్ క్విజ్-2025' పేరిట ఎంవీపీ కాలనీ అశ్వార్‌దాస్ పబ్లిక్ స్కూల్ వేదికగా ఈ పోటీలు జరగనున్నాయి. 7 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులు. క్విజ్‌లో పాల్గొనే ఆసక్తి గల విద్యార్థులు ఆయా స్కూళ్ల ప్రిన్సిపాళ్లను సంప్రదించి జూలై 20లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. పోటీల వివరాలకు 98481 98701 నంబర్‌లో సంప్రదించాలి.

ఇస్కాన్‌లో మార్మోగిన హరినామస్మరణ


అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: హరే రామ, హరే కృష్ణ అంటూ సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం రామకృష్ణులు నామాలు మార్మోగాయి. వారాంతపు పూజల సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలు, పలు ప్రవచనాలు ఆలపించారు. ఈ నేపథ్యంలో రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

క్లుప్తంగా

చురుగ్గా రైల్వే జోన్ పనులు


ముడసర్లోవ ప్రాంతంలో పొక్లెయిన్లు, లారీలతో జరుగుతున్న పనులు

ఆరిలోవ: ముడసర్లోవ వద్ద నిర్వహిస్తున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ముడసర్లోవ ప్రాంతంలో విశాఖ కేంద్ర కారాగారం ఎదురుగా రైల్వే జోన్ కోసం 52 ఎకరాల భూమిని కేటాయించిన విషయం తెలిసిందే. దీనిలో సుమారు ఆరు నెలల కిందట ల్యాండ్ టెస్టింగ్ పనులు చేపట్టడంతో పనులు ప్రారంభించారు. నెల రోజులుగా పూర్తి స్థాయి పనులు జరుపుతున్నారు. ప్రస్తుతం 14 ఎకరాల్లో విశాలమైన 12 అంతస్తుల భవనం నిర్మాణం పనులు చేపట్టారు. అండర్ గ్రౌండ్‌లో రెండు ఫ్లోర్లు, పైన 10 ఫ్లోర్లు నిర్మిస్తున్నారు. వర్షా కాలంలో పనులకు ఎలాంటి ఆటంకంగా రాకుండా ముందు జాగ్రత్తగా ఇసుక తీసుకొచ్చి నిల్వ ఉంచారు. రైల్వే జోన్ రీజనల్ మేనేజర్ కార్యాలయంతోపాటు ఉన్నతాధికారుల క్వార్టర్స్ అన్నీ ఇక్కడే నిర్మిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎంవీపీకాలనీ: జాతీయ రహదారిపై ఇసుకతోట కూడలిలోని లాన్సమ్ బిల్డింగ్ సమీపంలో గుర్తు తెలియని ఓ లారీ ఢీకొట్టడంతో అలబోని రమణ(46) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా.. అలబోని రమణ అతడి సోదరుడు అప్పలరాజు, కుటుంబ సభ్యులతో కలిసి ఎండాడలో నివాసముండేవాడు. లక్ష్మి అనే మహిళను వివాహం చేసుకుని ఆమెతో కలిసి వేరుగా నివసిస్తున్నాడు. ఏడాది కాలంగా దినసరి కూలీగా పనిచేస్తూ రాత్రి పూట బస్టాపుల్లో నిద్రపోయేవాడు. ఈ క్రమంలో ఈ నెల 29వ తేదీ ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో రోడ్డుపై వెళ్తుండగా ఇసుకతోట కూడలి దరి లాన్సమ్ బిల్డింగ్ ఎదుట గుర్తుతెలియని లారీ వేగంగా వచ్చి అతడిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. రమణ సోదరుడు అప్పలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

ఎంవీపీకాలనీ: వెంకోజీపాలెం కూడలిలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరిని లారీ ఢీకొనడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. శోభ సీతారాజు అనే వ్యక్తి పెదవాల్తేరు ఈఎస్‌టీ ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన పిల్లలకు కొర్రా లక్ష్మి అనే మహిళ ఇంట్లో కేర్ టేకర్‌గా పనిచేస్తోంది. ఈ నెల 28న లక్ష్మికి అనారోగ్యంగా ఉందని చెప్పడంతో సీతారాజు ఆమెను తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని వెంకోజీపాలెం మెడికవర్ ఆస్పత్రికి బయలు దేరాడు. ఈ క్రమంలో వెంకోజీపాలెం హనుమాన్ విగ్రహం సమీపంలో ఏపీ39ఈఆర్ 5466 నంబర్ గల లారీ వారి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. సీతారాజు రెండు కాళ్లు విరిగిపోగా.. లక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి క్షతగాత్రులను మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై బాధితుడు సీతారాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న స్టోరీ టెల్లింగ్

సీతంపేట: విశాఖపట్నం పౌర గ్రంథాలయం, భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ సంయుక్తంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ప్రపంచ సంగీత దినోత్సవం, జాతీయ పుస్తక పఠన మాస వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించాయి. సంగీతం, సాహిత్యం, కళల ఉత్తేజకరమైన సమ్మేళనాన్ని ఆకట్టుకునేలా అందించారు. నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కథకురాలు, వాయిస్ ఆర్టిస్ట్ ఎం.సీతాశ్రీనివాస్, పూర్వ విద్యార్థులతో కలిసి సంగీతంతో శ్రావ్య వినోదం అందించారు. మొదటి సెషన్‌లో బుందేల్ ఖండ్ జానపద కథ 'వాట్ ఏ సాంగ్' ప్రదర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న పిల్లలు కథపై చర్చించారు. వర్క్‌షీట్లు నింపి రంగులు వేశారు. రెండో సెషన్‌లో సంగీతంపై మక్కువ, గిటార్ నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న బాలుడి స్ఫూర్తిదాయ ప్రయాణాన్ని వివరించారు. లైవ్ గిటార్ ప్రదర్శన, కొంకణి పాట అలరించింది. ఈ సందర్భంగా పబ్లిక్ లైబ్రరీ కార్యదర్శి డి.ఎస్.వర్మ మాట్లాడుతూ ఇటువంటి యాక్టివిటీస్‌లో పిల్లలను నిమగ్నం చేయడం వల్ల వారిలో సృజనాత్మకత, ప్రతిభకు అద్దం పట్టవచ్చన్నారు.

కార్యకర్తలే వైఎస్సార్‌సీపీకి కొండంత బలం

ఎంవీపీకాలనీ: వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే కొండంత బలమని పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. 19వ వార్డుకు చెందిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆదివారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పార్టీ వార్డు అధ్యక్షుడు సూరాడ దాసు ఆధ్వర్యంలో జాలరిపేటలో జరిగిన ఈ కార్యక్రమంలో మొల్లి అప్పారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కిందిస్థాయి కార్యకర్తలు తొలి నుంచి వైఎస్సార్‌సీపీకి కొండంత అండగా నిలిచారన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వారు చూపిస్తున్న తెగువ, పార్టీ బలోపేతానికి చేస్తున్న సమష్టి కృషి వెలకట్టలేనివని ప్రశంసించారు. 19వ వార్డు నాయకులు, కార్యకర్తలు తూర్పు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి పెద్ద ఎత్తున కృషి చేయాలని కోరారు. వార్డు, బూత్ స్థాయి కమిటీలను ఏకాభిప్రాయంతో నియమించుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందనే ప్రకటించిన అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాటను ప్రతి కార్యకర్త గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గణేష్, పేర్ల రాజారావు, చిన్న, వసంత తదితరులు పాల్గొన్నారు.


19వ వార్డు సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు

9వ వార్డులో ఆత్మీయ సమావేశం

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డులో ఆదివారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. విశాలాక్షినగర్ ప్రాంతం జోడుగుళ్లపాలెంలోని పార్టీ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ కోరుకొండ స్వాతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొని మాట్లాడారు. పార్టీ బలోపేతంపై కార్యకర్తలతో ఆయన చర్చించారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. పార్టీకి భవిష్యత్‌లో మంచి రోజులు రానున్నాయని, పార్టీ సమావేశాలకు కార్యకర్తలు సమష్టిగా హాజరవుతుండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నాయకులు దాస్, సత్యవేణి, సీరజ్, నాని తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్‌కు గొడుగుందిగా..





వ్యాయామం కొందరికి దినచర్యలో భాగం. నిత్యం ఒక గంట సమయం వ్యాయామానికి కేటాయిస్తారు. ఇదే వారి ఆరోగ్య రహస్యం కూడా. అటువంటి వారు ఒక్కరోజు కూడా వ్యాయామం చేయకుండా గడపడానికి ఇష్టపడరు. ఆదివారం ఇటువంటి దృశ్యాలు విశాఖ సాగర తీరంలో కనిపించాయి. ఒకవైపు చిన్నగా చినుకులు పడుతున్నా.. వారు చేతిలో గొడుగు పట్టుకుని తమ దినచర్యను కొనసాగించారు. పదుల సంఖ్యలో నగరవాసులు చేతిలో గొడుగు పట్టుకుని నడకను కొనసాగించారు. వీరంతా దాదాపుగా నాలుగు పదుల వయస్సు దాటినవారే. వాతావరణం అనుకూలించకపోయినా పరిష్కార మార్గాన్ని అన్వేషించి తమ లక్ష్యాలను చేరుకుంటున్నారు. ఆరోగ్య పరిరక్షణ కోసం వర్షంలోనూ వాకింగ్ చేస్తూ ఉత్సాహంగా కనిపిస్తున్నారు.

– ఏయూక్యాంపస్

సాగర తీరాన సైకిల్‌పై సవారీ


బీచ్ రోడ్డులో సైక్లింగ్ చేస్తున్న యువత


సైకిల్ తొక్కుతున్న చిన్నారులు

ఏయూక్యాంపస్: ఆదివారం వచ్చిందంటే చాలు సాగర తీరాన బీచ్ రోడ్డు చిన్నారులు, యువత, వృద్ధులు ఇలా అన్ని వయసుల వారితో నిండిపోతుంది. ఎవరికి వారు తమకు నచ్చిన వ్యాయామం, వాకింగ్, సైక్లింగ్ వంటివి చేస్తుంటారు. ఆదివారం ఉదయం బీచ్ రోడ్డులో పలువురు యువత, చిన్నారులు సైకిల్ తొక్కుతూ సందడి చేశారు. ఉదయం 7 గంటల వరకు వాహనాల నిషేధం ఉండటంతో చిన్నారులు స్వేచ్ఛగా బీచ్ రోడ్డులో సైకిల్‌పై సవారీ చేసే అవకాశం లభించింది. వైఎంసీఏ నుంచి ఆర్.కె.బీచ్ వరకు సైకిల్ తొక్కుతూ స్నేహితులతో కలిసి కబుర్లు చెప్పుకుంటూ గడిపారు.

భయపెడుతున్న శునకాలు


తీరంలో పరిగెడుతున్న వ్యక్తి పక్కనే శునకాలు


సాగర తీరంలో తిష్ట వేసిన శునకాలు

ఏయూక్యాంపస్: సాగర తీరంలో శునకాలు భౌభౌ మంటూ సందర్శకులను భయపెడుతున్నాయి. పదుల సంఖ్యలో గుంపులుగా తిష్ట వేసి పర్యాటకులు, నగరవాసులకు ప్రశాంతత లేకుండా చేస్తున్నాయి. చిన్నారులు ఆడుకుంటూ పరుగులు పెడితే వారి వెంట పడుతున్నాయి. ఆదివారం ఉదయం ఇటువంటి సంఘటన వైఎంసీఏ ఎదురుగా ఉన్న బీచ్‌లో జరిగింది. సెలవు రోజు కావడంతో స్నేహితులతో వచ్చి బీచ్‌లో ఆడుకుంటున్న చిన్నారులను కుక్కలు వెంబడించాయి. అక్కడే ఉన్న ఇతరులు వాటిని తరిమేయడంతో చిన్నారులు ఊపిరి పీల్చుకున్నారు. తరచూ కుక్కలు సందర్శకులను ఇబ్బందులు పెడుతున్నాయి. వీటిని కట్టడి చేసే విధంగా జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టాలని సందర్శకులు కోరుతున్నారు.

ఇటు చెత్త.. అటు బురద


మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో పేరుకుపోయిన చెత్త


బురదమయంగా స్టేషన్ ప్రాంగణం

అధ్వానంగా త్రీ టౌన్ పీఎస్ ప్రాంగణం

బీచ్‌రోడ్డు: మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఎటు చూసినా చెత్తే దర్శనమిస్తోంది. స్టేషన్ ముఖద్వారాన్ని ఆనుకుని ఉన్న ప్రాంతంలో చెత్త కుప్పలుగా పడి ఉంటోంది. మరో వైపు వర్షం పడితే స్టేషన్ ప్రాంగణమంతా బురదమయంగా మారుతోంది. మూడు రోజుల కిందట కురిసిన వాన ప్రభావంతో నేటికీ స్టేషన్ ప్రాంగణంలోని బురద పోలేదు. ఒక వైపు చెత్త.. మరో వైపు బురదతో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ అధ్వానంగా కనిపిస్తోంది. పోలీస్ సిబ్బందితోపాటు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు ఇబ్బంది పడుతున్నారు.

రహదారులపై వ్యర్థాలు


చినవాల్తేరు రహదారిలో పేరుకుపోయిన చెత్త


డాక్టర్స్ కాలనీ రోడ్డుపై చెత్త కుప్ప

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డు చినవాల్తేరు, డాక్టర్స్ కాలనీ ప్రాంతంలో రెండు రోజులుగా పారిశుధ్య కార్మికులు రాకపోవడంతో స్థానికులు ప్రధాన రహదారిపై చెత్త వేశారు. దీంతో ఆ మార్గంలో నడుచుకుంటూ వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని పాదచారులు చెబుతున్నారు. చెత్త నుంచి వెలువడుతున్న దుర్వాసన భరించలేక పోతున్నామని చుట్టుపక్కల నివాసులు వాపోతున్నారు. పారిశుధ్య విభాగం అధికారులు స్పందించి తక్షణమే చెత్త తొలగించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వెలమలకు ప్రాధాన్యమివ్వాలి


మాట్లాడుతున్న గోవిందరావు

ఏయూక్యాంపస్: నామినేటెడ్ పదవుల్లో వెలమలకు తగిన ప్రాధాన్యమివ్వాలని ఏపీ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు విజ్ఞప్తి చేశారు. బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెలమ సామాజిక వర్గాన్ని బీసీ–డీ నుంచి బీసీ–ఏ జాబితాలోకి మార్చాలన్నారు. వెలమ కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా వెలమ సామాజిక భవనాల నిర్మాణానికి స్థలాలను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వెలమ సామాజిక వర్గ హక్కుల పరిరక్షణ కోసం త్వరలో విశాఖ వేదికగా వెలమ గర్జన సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ అదనపు ప్రధాన కార్యదర్శి పెదిరెడ్డ సత్యం, కార్యదర్శి పి.శ్రీనివాస్, విశాఖ జిల్లా ఇన్‌చార్జి ఆర్.ఈశ్వరరావు, అనకాపల్లి ఇన్‌చార్జి బి.పైడం నాయుడు, పరుదు రాజ్ తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..


చిన్నపాటి వర్షానికి చిత్తడిగా మారిన తోటగరువు హైస్కూల్ క్రీడా మైదానం

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. ఇక్కడ ఇసుక, మట్టి కలిసిన నేల కావడంతో విద్యార్థులు ఆడుకోవడానికి ఈ క్రీడా మైదానం అనువుగా ఉంటుంది. దీంతో పాఠశాల విద్యార్థులు ఖాళీ పీరియడ్లు, గేమ్స్ పీరియడ్లలో ఇక్కడ సరదాగా ఆడుతుంటారు. అంతవరకు బాగానే ఉంటుంది. వర్షం పడితే ఈ మైదానం బురదగా మారిపోతుంది. ఆదివారం ఉదయం కురిసిన చిన్నపాటి వర్షానికే మైదానమంతా బురదగా మారింది. ఇటీవల ఇక్కడ జరిగిన అదనపు భవనాల నిర్మాణ సమయంలో సామగ్రిని తీసుకెళ్లే లారీలు తరచూ తిరుగుతుండేవి. వాటి రాకపోకల వల్ల ఈ క్రీడా మైదానం గోతులు పడింది. దీని వల్ల మైదానంలో ఎత్తుపల్లాలు ఏర్పడటంతో వర్షం నీరు నిల్వ ఉండిపోయి మధ్యమధ్యలో బురదగా మారుతోంది. దీంతో వర్షం పడిన సమయంలో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు